ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



ఏపీఎస్ఈబీ కాలనీలోని డీఏవీ స్కూల్ వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్ఐ బాలరాజు



52వ వార్డు శాంతినగర్ చైతన్య స్కూల్ వద్ద తల్లిదండ్రుల కోలాహలం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. గోపాలపట్నం మండల పరిధిలో 13 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత విద్యార్థులను లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని కేంద్రాల్లో తాగు నీటి సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతీ కేంద్రంలో సచివాలయ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తను విధుల్లో ఉంచారు. గోపాలపట్నం ఎంఈవో అంబటి సోమేశ్వర రావు కేంద్రాలను పరిశీలించి విధుల్లో ఉన్న ఇన్విజిలేషన్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద రావు, ఎస్ఐ ఎస్. బాలరాజు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మల్కాపురం: పదోతరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు ఇబ్బంది పడకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత,ప్రైమరీ పాఠశాలలో 326 మంది, శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల,భాష్యం,సరస్వతి విద్యావిహార్ కేంద్రాల్లో 524 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మల్కాపురం పోలీసులు ఆయా కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు.

కేంద్రాల వద్ద సందడి

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పదోతరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతగా జరిగాయి. ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు తల్లి దండ్రులతో సహా చేరుకున్నారు. 9 గంటలకు విద్యార్థులకు పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించారు. మరి కొన్ని కేంద్రాల్లో 8.30 గంటలకు లోపలికి అనుమతించారు. తొలి



ఆల్ ద బెస్ట్ నాన్నా..

రోజు పరీక్షలు కావడంతో చాలా మందిలో టెన్షన్ కనిపించింది. తల్లి దండ్రులు పిల్లలకు ధైర్యం చెప్పారు. పరీక్షలు రాసి బయటకు వచ్చే వరకు చాలా మంది తల్లి దండ్రులు బయట వేచి ఉన్నారు. పిల్లలు పరీక్షా కేంద్రాలకు వెళ్లే సమయంలో ఆల్‌దా బెస్ట్ చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించి లోపలికి విడిపెట్టారు.



మల్కాపురం పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు



విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి లోపలికి అనుమతిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

బొత్స ఝాన్సీని కలిసిన బెహరా



బొత్స ఝాన్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న బెహరా భాస్కరరావు, శ్రీనివాసరావు

గోపాలపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పార్టీ నాయకులతో వెళ్లి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఆమె కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గుణిశెట్టి శ్రీనివాసరావును ఝాన్సీ అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామినాయుడు, కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవిందు, ఇల్లపు సురేష్, గొంతిన జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్ లక్ష్మణరావుకు వినతి పత్రం అందిస్తున్న గాంధీజీవీధి వాసులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు గాంధీజీవీధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుకు కాలనీ పెద్దలు సర్వసిద్ధి పైడిబాబు, శీర శ్రీనివాసరావు వినతి పత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బీశెట్టి గణేష్, నాయకులు రామకృష్ణ, గాంధీజీవీధి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో 11కేవీ విద్యుత్ ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో విధులు నిర్వహిస్తూ కింద పడిపోయిన ఒక లైన్‌మన్, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అలీ(35) అనే లైన్‌మన్ గత నెల 24న కంచరపాలెం, ధర్మానగర్ వద్ద 11 కేవీ ఫీడర్ విద్యుత్ నిర్వహణలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా పోల్ మీద నుంచి కిందపడిపోయాడు. దీంతో అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సయ్యద్ అలీ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతుడి సోదరుడు మహమ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వీధుల్లో సందడి

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఎన్నికల వేడి మొదలైంది. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారం మొదలు పెట్టారు. వార్డు గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు తమ ప్రభుత్వంలో చేసిన మేలును ప్రజలకు వివరిస్తున్నారు. జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. అనంతరం ఆయా ప్రాంతాలకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

గోపాలపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను డీసీపీ మోకా సత్తిబాబు సోమవారం పరిశీలించారు. మర్రిపాలెం రైల్వే స్కూల్, పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద అంబేడ్కర్ భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో 23 పోలింగ్ కేంద్రాల్లో 75 బూత్‌లు ఉన్నాయన్నారు. అందులో ఎనిమిది బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించి, పరిశీలించామని తెలిపారు. ఈ కేంద్రాల్లో భద్రత ఏవిధంగా ఉండాలి, సమస్య ఏర్పడితే తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గస్తీ ముమ్మరం



మర్రిపాలెం రైల్వే స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సత్తిబాబు, సీఐ చక్రధరరావు

చేయనున్నామని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సీఐ వి.చక్రధరరావు పాల్గొన్నారు.

'కార్మిక వర్గంపై కక్ష సాధింపు చర్యలు తగవు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోయాజమాన్యం కార్మిక వర్గంపై క్ష్ల సాధింపు చర్యలకు పాల్పడుతోందని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి దరి యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యాజమాన్యం రోజుకో కొత్త ఉత్తర్వులతో కార్మికులను హడలెత్తిస్తోందన్నారు. ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చాల్సిన యాజమాన్యం కార్మికులపై దాడులకు దిగుతోందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు తప్పవన్నారు. ఉక్కు పరిరక్షణ సభ విజయవంతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, డి.మోహన్, కోరాడ వెంకటరావు, ప్రసాద్, పి.వి. నగేష్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే ప్రగతి

కూర్మన్నపాలెం : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లనే అభివృద్ధి జరిగిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటు పరం చేయాలనుకోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1131వ రోజు, సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి, తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

స్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో 'బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్'

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ పాఠశాలల్లోని పూర్వ విద్యార్థులకు, సంస్థ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకే బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సంస్థ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ లోగోను సంస్థ సీనియర్ ఉద్యోగి టి.ఎల్.నర్సింగరావు ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న ఉద్యోగుల పిల్లలకు తమ చేతనైన ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. అసోసియేషన్‌లో 54 మంది సభ్యులు అవయవ దానానికి అంగీకారం తెలియజేస్తూ ఆర్గాన్ డొనేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధికి దరఖాస్తులు అందించారు. అనంతరం అసోసియేషన్ నూతన



అసోసియేషన్ ప్రతినిధులు

కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ములకా నానిబాబు (అమెరికా), అధ్యక్షుడిగా జరజాన రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా పి. శ్రీనివాసులు, కార్యదర్శిగా మద్దిల రవిశంకర్ తదితరులను ఎన్నుకున్నారు.


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చురుగ్గా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: జాతీయ సేవా పథకం వలంటీర్లు చురుగ్గా ఉంటూ జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో 60వ వార్డు ఇందిరా కాలనీలో సోమవారం ఉదయం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ సమైక్యత శిబిరాలు, భారత సాహస యాత్ర, రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లలో పాల్గొనే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం వలంటీర్లు ఇందిరా కాలనీలో ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, ఎ.సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి పునీత జోజప్ప మహోత్సవాలు



జోజప్ప విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 19 నుంచి పాలక పునీత జోజప్ప మహోత్సవం జరగనున్న దృష్ట్యా సోమవారం కళాశాల ప్రాంగణంలో జోజప్ప విగ్రహానికి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ దయామయుడు, ప్రేమైక మూర్తి ఏసుప్రభువు తండ్రి జోసెఫ్ పేరుతో స్థాపించిన కళాశాల నిరంతరం ప్రేమతో సంరక్షిస్తున్న పునీతను కీర్తిస్తుందన్నారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి, సిస్టర్లు మేరీ, జైన్, నాన్సీ, దీపాలి, డెయిజీ, అధ్యాపకులు డాక్టర్ హరిణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 25.8 లక్షలు

కంచరపాలెం : జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీలు లెక్కించారు. 68 రోజులకుగాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.25,88,219 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కంచరపాలెం పోలీసులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

సీతమ్మధార: సీతమ్మధార: మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... అక్కయ్యపాలెం, జగన్నాథపురంలో ఏయూ ఉద్యోగి శంకర శ్రీనివాస్ కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన భార్య హైమావతి గవర్నమెంట్ టీచర్ కాగా, కుమారుడు భానుచైతన్య (20) ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం, కుమార్తె కళాశాలలో చదువుతున్నారు. భానుచైతన్య ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పడంతో అప్పటి నుంచి మౌనంగా ఉండేవాడు. సోమవారం ఉదయం శంకర శ్రీనివాస్ విధులకు, హైమావతి పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్‌కు వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాను చైతన్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం హైమావతి ఇంటికి వచ్చి చూడగా, భాను చైతన్య ఉరి వేసుకుని కనిపించాడు. ఇరుగు పొరుగు వారి సహాయంతో, కిందికి దించి పోలీసులకు సమాచారం అందించారు. ఫోర్త్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు భానుచైతన్య

పెళ్లి పీటలపైనే వైఎస్సార్‌సీపీలోకి..

విశాఖ విద్య: మూడు ముళ్లతో ఒకటైన ఆ జంట పెళ్లి పీటలపై వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు. జీవీఎంసీ 52 వార్డు నేతాజీ నగర్‌లో చోటు చేసుకున్న సంఘటన ఇది. నేతాజీ నగర్‌కు చెందిన అర్జి శ్యామల రైతు బజారు బయట కూరగాయల వ్యాపారం చేస్తుండగా, ఆమె భర్త ఆటో డ్రైవర్. కాలనీలో ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుండే వారు. పదేళ్లుగా టీడీపీ సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్నారు. అయితే కుమార్తె జ్యోత్స్న పెళ్లి విషయంలో టీడీపీ నాయకులు మాట సాయం చేసేందుకు కూడా ముందుకు రాలేదు. పెళ్లి కబురు చెబితే డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో శ్రద్ధతో ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్లా కృష్ణ ఇలా ఎంతో మందితో కలిసి ఇంటికి వెళ్లి వధూ వరులను ఆశీర్వించారు. కష్టసుఖాల్లో తోడుగా నిలిచే వారు నిజయమైన నాయకులని, అలాంటి మనసున్న



వధూవరులను ఆశీర్వదించి, వైఎస్సార్‌సీపీ కండువాలు వేస్తున్న ఆనంద్‌కుమార్

వ్యక్తులు ఆడారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్ అని, ఇక నుంచి తమ కుటుంబమంతా వారి వెంటే ఉంటామని అర్జి శ్యామల తెలిపింది. వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆశీర్వదించాలని కోరడంతో ఆనంద్ కుమార్ వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రకటించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, కరాస శ్రీను పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు



రూట్ మార్చ్‌లో పాల్గొన్న డీసీపీ-2 సత్తిబాబు, ఏసీపీ నరసింహమూర్తి తదితరులు

విశాఖ విద్య/గోపాలపట్నం: విశాఖ వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో సోమవారం పోలీసులు లాంగ్ రూట్ మార్చ్ నిర్వహించారు. డీసీపీ –2 సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎన్ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం బంక్ వరకు రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భరోసా నింపేందుకు, అసాంఘిక శక్తులకు హెచ్చరిక చేసేందుకు ఈ రూట్ మార్చ్ నిర్వహించినట్టు డీసీపీ-2 సత్తిబాబు తెలిపారు. ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకు, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సీఐఎస్ఎఫ్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

సబ్బవరం: మహిళలపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో తమని తాము రక్షించుకునేందుకు మార్గాలు అన్వేషించడం చాలా అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సూర్య ప్రకాశ రావు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా సోమవారం నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తమై మెలకువలతో వేగంగా ఎలా స్పందించాలో ప్రత్యేక నిపుణుడు కిషోర్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా చైర్ పర్సన్ డాక్టర్ విజయ లక్ష్మి, ఫ్యాకల్టీ మెంబర్ భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఆత్మరక్షణపై మెలకువలు నేర్పిస్తున్న కిషోర్ కుమార్

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ప్రధానం

ఏయూ క్యాంపస్: సమాజంలో నిత్యం పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ఎంతో ప్రధానమైన అంశమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గ్లోబల్ రీ సైక్లింగ్ డేని పురస్కరించుకుని ఏయూ విద్యా విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏయూలో త్వరలో ఈ–వ్యర్థాలను సేకరించే ప్రత్యేకమైన ఈ–బిన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నగరానికి చెందిన ఎంఎస్ఎంఈ సంస్థ ఎలక్ట్రో ప్రో సంస్థ సహకారంతో ఈ–వ్యర్థాలను పూర్తి స్థాయిలో రీ సైక్లింగ్ చేసే దిశగా పనిచేస్తామన్నారు. పుడమిని పరిరక్షించుకోవడంలో వ్యర్థాల నిర్వహణ ఒక ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల్లో వీటిపై విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. వైద్య రంగంలో ఏర్పడే వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో రీ సైకిల్ చేయడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులను వీసీ వీక్షించి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య డి.నాగరాజకుమారి, బోధన సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

స్పా ముసుగులో వ్యభిచారం

బీచ్‌రోడ్డు: స్పా పేరుతో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వైజాగ్ టవర్స్ బిల్డింగ్‌లో గల గ్లామ్ అండ్ గ్లో బ్యూటీ సెలూన్ థాయ్ స్పాలో వ్యభిచారం జరుగుతోందని స్పెషల్ బ్రాంచి పోలీసులకు, సీఐ పార్థసారథికి సమాచారం అందింది. వెంటనే ఇద్దరు మధ్యవర్తులతో స్పా కేంద్రంపై సోమవారం దాడి చేయగా ఓ యువతిని, విటుడు హితేష్ టీయాని పట్టుకున్నారు. స్పా నిర్వాహకురాలు నండూరి లక్ష్మి, వాసుబాబుతోపాటు మరో ఇద్దరు మహిళలను కూడా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం నండూరి లక్ష్మి, వాసుబాబును కోర్టు అదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు మహిళలకు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్‌డీకి ఉద్యోగుల అభినందనలు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) డాక్టర్ రామ గిద్దయ్యను జేఏసీ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. ఇటీవల ఆర్‌డీ రామ గిద్దయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు ఎం. వెంకట లక్ష్మి, శ్రీనివాస ఆచార్యులు, నగేష్ పటాన్నయక్, సాంబమూర్తి, రాము, బండారు శ్రీనివాస్, శేషు బాబు, రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశాఖ ఆర్‌డీ రామ గిద్దయ్యను అభినందిస్తున్న ఉద్యోగులు